నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 4 జూన్ 2025 | HYDERABAD

గోషామహల్ పోలీస్ స్టేడియంలో మహిళా కానిస్టేబుళ్లకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సిటీ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి ఇవ్వడంతో సీతాఫల్‌మండిలోని రేషన్ షాపు వద్ద క్యూలో నిల్చుని పడిగాపులు గాస్తున్న లబ్ధిదారులు

మా అన్నకు చెప్పకుండా రోడ్డు వేస్తారా?

కాంగ్రెస్ నేతల దబాయింపుతో నిలిచిన పనులు

ఎమ్మెల్యే దానం అనుచరులపై స్థానికుల ఆగ్రహం

బంజారాహిల్స్, జూన్ 3: 'మా అన్నకు చెప్పకుండా రోడ్డు వేయడం ఏందిరాబై.. పనులు ఆపేయ్..' అంటూ అధికార పార్టీ నేతలు హూంకరింపులతో అభివృద్ధి పనులు ఆగిపోయాయి. ఏడాదినుంచి రోడ్డు కోసం చెప్పులరిగేలా తిరగితే పట్టించుకోని అన్న ఇప్పుడు ఎందుకు అడ్డుపడతాడంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని జ్ఞానీ జైల్‌సింగ్‌నగర్ బస్తీలో ఏడాదినుంచి రోడ్డంతా గుంతలు పడి నడవడానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు వాహనదారులు గతుకుల రోడ్లపై కిందపడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీంతో ఇటీవల జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ జీహెచ్ ఎంసీ ఉన్నతాధికారులను కలిసి పరిస్థితిని వివరించారు. స్పందించిన అధికారులు రూ.19.50లక్షల నిధులను మంజూరు చేశారు. దీంతో గత నెల 30న కార్పొరేటర్ పనులు ప్రారంభించారు. దీంతో రెండ్రోజుల పాటు ప్రస్తుతం ఉన్న రోడ్డును తొలగించే పనులు సగం పూర్తయ్యాయి. మిగతా IIవ పేజీలో

పూర్తిగా పాడైన రోడ్డు

జ్ఞానీజైల్ సింగ్‌నగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

అక్రమమని తెలిసినా మౌనం

నమస్తే ఎఫెక్ట్

హౌసింగ్ బోర్డు స్థలాన్ని చూపి అనుమతి

'నమస్తే' కథనంతో నోటీసులు జారీ

- అనుమతి రద్దు చేయాలని కోరిన హౌసింగ్ బోర్డు అధికారులు
- పర్మిషన్ రద్దు చేయడంలో టౌన్‌ప్లానింగ్ అధికారుల తాత్సారం

అడ్డగోలు అక్రమ నిర్మాణాలతో కొందరు రెచ్చిపోతున్నారు..అప్రోచ్ రోడ్డు లేకుండానే హౌసింగ్ బోర్డు స్థలాన్ని చూపించి భారీ రెసిడెన్షియల్ ప్రాజెక్టు అనుమతికి దరఖాస్తు చేసుకున్న సదరు నిర్మాణదారుడికి టౌన్‌ప్లానింగ్ అనుమతులు ఇచ్చేసింది. స్థానికుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ అక్రమ నిర్మాణ భాగోతంపై 'నమస్తే తెలంగాణ' ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. స్పందించిన హౌసింగ్ బోర్డు అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అనుమతిని రద్దు చేయాలంటూ జీహెచ్ఎంసీని కోరింది. స్పందించిన టౌన్‌ప్లానింగ్ సదరు నిర్మాణ దారుడికి షోకాజ్ నోటీస్ జారీ చేసింది. ఏడు రోజుల్లోగా అప్రోచ్ రోడ్డుపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది..జీహెచ్ఎంసీ జారీచేసిన నోటీసులకు ఏ మాత్రం భయపడకుండా సదరు నిర్మాణదారుడు పనులను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.

సిటీబ్యూరో, కేపీహెచ్‌బీ కాలనీ , జూన్ 3 (నమస్తే తెలంగాణ) : మూసాపేట సర్కిల్ బాలాజీ నగర్ డివిజన్‌లో ఓ బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం కోసం తప్పుడు పత్రాలతో అనుమతులు పొందాడని తెలిసిన జీహెచ్ ఎంసీ యంత్రాంగం సదరు నిర్మాణంపై చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారు. కూకట్‌పల్లిలోని సర్వేనంబర్ 988 , 991లలో 12,848.76 స్క్వేర్ మీటర్ల విస్తీర్ణంలో కే పాండు అండ్ ఇతరుల పేరుతో రెసిడెన్షియల్ బిల్డింగ్‌ల నిర్మాణం కోసం బ్లాకులు..ఏ, బీ, సీ, డీ(నాలుగు బ్లాకులు)... ఒక్కొక్క బ్లాక్ సెల్లార్ ప్లస్ స్టిల్ట్ ప్లస్ 5 అంతస్తుల నిర్మాణం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో అనుమతులు పొందారు. అనుమతి కోసం దరఖాస్తు చేసిన పత్రాల్లో దాని పక్కనే ఉన్న హౌసింగ్ బోర్డుకు చెందిన (సర్వే నంబర్ 939) స్థలంలో 40 ఫీట్ల రోడ్డును మిగతా IIవ పేజీలో

ప్రీలాంచ్ పేరిట ₹300 కోట్ల మోసం

తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తామని జయత్రి రియల్ ఎస్టేట్ సంస్థ టోకరా

న్యాయం చేయాలని మొర పెట్టుకున్న బాధితులు

సిటీ బ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివారులోని గోపన్‌పల్లిలో తక్కువ ధరకు ప్లాట్లు ఇప్పిస్తానని ప్రీలాంచ్ పేరిట జయత్రి రియల్ ఎస్టేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మోసం చేసిందని బాధితులు ఆరోపిస్తున్నారు. వందలాది మంది మధ్యతరగతి ప్రజల నుంచి దాదాపు రూ.300 కోట్లకు పైగా వసూలు చేసి ముఖం చాటేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జయత్రి కంపెనీ తమను ఆకర్షణీయమైన బ్రోచర్లు, ప్రీ లాంచ్ ఆఫర్లతో డిస్కౌంట్ ధరలకు ప్రైమ్ ప్లాట్లను ఇస్తామని నమ్మబలికిందని బాధితులు ఆరోపిస్తున్నారు. వీరికి కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్ వద్ద100 మందికి పైగా ఉద్యోగులతో కూడిన విలాసవంతమైన కార్పొరేట్ కార్యాలయం చూపించడంతో పెద్ద సంస్థ అని నమ్మామని అంటున్నారు. రెండేళ్లలోపు ప్లాట్లను అప్పగిస్తామంటే రూ. 20 లక్షల నుంచి రూ.1.8 కోట్ల వరకు వివిధ దశల్లో చెల్లించామని చెబుతున్నారు. గడువు ముగిసినా వివిధ రకాల సాకులు చూపిస్తూ కాలం గడుపుతున్నారని అన్నారు. ప్రధాన నిందితుడు కాకర్ల శ్రీనివాస్, మరో 19 మంది డైరెక్టర్లతో కలిసి ఫిబ్రవరి 2021లో జయత్రి గ్రూప్‌ను స్థాపించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే హిల్టన్ జయ డైమండ్ పేరుతో ఇప్పటికే భారీ వెంచర్‌ను ప్రారంభించి మోసానికి పాల్పడి సంస్థకు చెందిన శ్రీనివాస్‌తో పాటు మరికొందరు అరెస్టయి ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చినట్లు వారు చెబుతున్నారు. ఇదే సంస్థ గతంలో రాజమండ్రిలో మిగతా IIవ పేజీలో

రోడ్డున పడేశారు.. ఆదుకోండి

ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ల ఆందోళన

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల సమన్వయ లోపంతో తమ బతుకులు రోడ్డున పడ్డాయని, రెండు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. జీహెచ్ఎంసీ ట్రాన్స్‌పోర్టు విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన ఈవీడీఎం విభాగంలో డ్రైవర్లుగా పనిచేసే తమను హైడ్రాకు బదిలీ చేశారని, హైడ్రా అధికారులు తమను డ్రైవర్ వృత్తి కాకుండా పార్కుల్లో సెక్యూరిటీ సిబ్బందిగా వినియోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందులో కొందరిని హైడ్రా తీసుకోకుండా తిరిగి జీహెచ్ఎంసీకి పంపించిందని ఆరోపించారు. ఈ రెండు శాఖల సమన్వయ లోపంతో నలిగిపోతున్నామన్నారు. జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కుటుంబ పోషణ కూడా భారవుతుందని , ఇంటి రెంట్లు కూడా కట్టలేని స్థితిలో ఉన్నామని వాపోయారు. కమిషనర్ జోక్యం చేసుకోవాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేటినుంచి మున్సిపాలిటీల్లో వార్డుల విభజన

రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో 8 మున్సిపాలిటీల్లో వార్డులు

మేడ్చల్, రంగారెడ్డి, జూన్ 3(నమస్తే తెలంగాణ): మహానగర అనుబంధ జిల్లాలైన మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో పలు మున్సిపాలిటీల్లో వార్డుల విభజన జరిగింది. ఈ మేరకు ప్రభుత్వం రేపో మాపో నోటిఫికేషన్ జారీ చేయనుందని సమాచారం. మేడ్చల్ జిల్లాలో ఇటీవల కొత్తగా ఏర్పడిన అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట మున్సిపాలిటీల్లో వార్డులను ఖరారు చేశారు. ఎల్లంపేట, మూడుచింతపల్లి మున్సిపాలిటీల పరిధిలో 24 వార్డులు, అలియాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డుల ఏర్పాటుగా గెజిట్‌ను ఎప్రిల్ 15న గెజిట్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఆయా మున్సిపాలిటీలలో వార్డు విభజను నోటిఫికేషన్‌కు ముందే అధికారులు మిగతా IIవ పేజీలో

మీ భర్తకు ప్రమాదం జరిగింది

అర్జెంట్‌గా డబ్బులు పంపించండంటూ..

రూ. 2.32 లక్షలు కాజేసిన సైబర్‌ఛీటర్స్



సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): మీ భర్తకు ప్రమాదం జరిగిందని అర్జెంట్‌గా డబ్బులు పంపించాలని బురిడీ కొట్టించారు. రాంపల్లి ప్రాంతానికి చెందిన బాధితురాలికి గత నెల 17న జ్యోతి అనే పేరుతో మరో మహిళ ఫోన్ చేసింది. బెంగుళూర్‌లో మీ భర్తతో కలిసి బైక్‌పై వెళ్తుండగా రోడ్డు ప్రమాదం జరిగిందని, బలమైన గాయాలు కావడంతో యశోద దవాఖానకు తరలించామంటూ ఏడ్చుకుంటూ మాట్లాడింది. బాధితురాలు అది నిజమని భావించి ఆరు దఫాలుగా రూ. 2.32 లక్షలు పంపించింది. తరువాత ఆ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. భర్తకు ఫోన్ చేసి మాట్లాడి, తనను ఎవరో మోసం చేశారని గుర్తించి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్

ఒకరు మృతి.. 70మందికి అస్వస్థత.. ఇద్దరి పరిస్థితి విషమం

ఎర్రగడ్డ, జూన్ 3: ఎర్రగడ్డలోని ప్రభుత్వ మానసిక వైద్యశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా ఒక రోగి మృతిచెందగా, 70మంది రోగులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే.. మానసిక వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులకు సోమవారం మామూలు ఆహారం అన్నం, అరటి పండ్లు, గుడ్లతో పాటు పరమాన్నాన్ని కూడా వడ్డించారు. సాయంత్రానికి డీసీ, కోర్టు వార్డుల్లోని కొంత మందికి స్వల్ప వాంతులు, విరోచనాలు మొదలయ్యాయి. వైద్యులు చికిత్స నందించినా కూడా డీసీ వార్డులో చికిత్స పొందుతున్న వ్యక్తి(30) తీవ్ర అస్వస్థతకు గురై మంగళవారం ఉదయం చనిపోయాడు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీకి తరలించారు. అస్వస్థతకు గురైన 70 మంది రోగులల్లో ఇద్దరు తీవ్రమైన అస్వస్థతకు గురికావడంతో వెంటనే వారిని ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నారు. మిగతా 68 రోగులకు ఉస్మానియా వైద్యులు ఎర్రగడ్డ మానసిక వైద్యశాలలోనే చికిత్సనందిస్తుండటం గమనార్హం. మరోవైపు ఫుడ్ పాయిజన్ ఎలా జరిగిందన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. రోగుల మల నమూనాలను ఉస్మానియా దవాఖాన మైక్రోబయాలజీ విభాగానికి, నీటి నమూనాలను నారాయణగూడ లోని ఐపీఎం నకు పంపించారు. హైదరాబాద్ కలెక్టర్ అనురాగ్ దుర్సెట్టి ఆసుపత్రికి చేరుకొని రోగుల పరిస్థితిపై ఆరా తీశారు. జరిగిన సంఘటన గురించి డాక్టర్ అనిత వివరణ కోరగా.. 70 మంది అస్వస్థతకు గురైన మాట వాస్తవమని. ఐపీఎం, ఉస్మానియా ల నుంచి రిపోర్టులు వచ్చిన తర్వాత అసలు విషయం తెలుస్తుందని ఆమె పేర్కొన్నారు.

డైటీషియన్ పర్యవేక్షణ ఉందా..?

ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలలో మానసిక రోగులకు అందించే ఆహార నాణ్యత పట్టించుకునే నాథుడే లేడు. చాలా కాలంగా ఖాళీగా ఉన్న రెగ్యులర్ డైటీషియన్ ఫోస్ట్ ను భర్తీ చేయకుండా వదిలేశారు. ఆసుపత్రిలోని సిబ్బందే డైటీషియన్ బాధ్యత తీసుకోవడంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగానే సాగుతుంది. ఎన్నడూ లేనంతగా 70 మంది అస్వస్థతకు గురికావడంతో అనేక రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కల్తీ అల్లం పేస్టు

సిటీబ్యూరో, జూన్ 3 (నమస్తే తెలంగాణ): హానికరమైన పదార్థాలతో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను తయారుచేసి అమ్మకాలు సాగిస్తున్న మహమ్మద్ ఫైజల్‌ను సౌత్ ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్, బండ్లగూడ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు.. పటేల్‌నగర్‌లో ఎఫ్‌కేఫుడ్ ప్రొడక్ట్ పేరుతో అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారు చేసి అమ్మకాలు చేస్తున్న మహ్మద్ ఫైజల్ దుకాణంపై దాడులు చేశారు. ఫైజల్ తమ ఉత్పత్తులను వినియోగదారులకు, కిరాణ దుకాణాలకు అమ్ముతున్నారని తెలిపారు. ఈ పేస్ట్ టైటానియమ్ డైఆక్సైడ్, టర్మరిక్ పౌడర్‌తో కలిపి తయారుచేస్తున్నారని, ఇవి ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రమాణాలను పాటించడం లేదని గుర్తించినట్లు తెలిపారు.

ఈ దాడుల్లో 870 కిలోల అల్లం వెల్లుల్లి పేస్ట్, 4 కిలోల టైటానియమ్ డైఆక్సైడ్, 16 కిలోల మోనో సైట్రేట్, 4 కిలోల టర్మరిక్ పౌడర్ స్వాధీనం చేసుకున్నామని టాస్క్ ఫోర్స్ పోలీసులు వివరించారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

కేబీఆర్ పార్కులో పర్యటించిన జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

సిటీబ్యూరో, కేపీహెచ్‌బీ కాలనీ, జూన్ 3 (నమస్తే తెలంగాణ) : వాకర్స్ సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పనులను వెంటనే పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అధికారులతో కలిసి కేబీఆర్ పార్కులో చేపట్టిన పనులను పరిశీలించారు. లైసెన్స్ తీసుకున్న పెట్ డాగ్స్‌ను మాత్రమే పార్కులోకి తీసుకురావాలని ఆదేశించారు. కేబీఆర్ పార్కు చుట్టూ హెచ్ సిటీ ద్వారా చేపట్టే ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు కోర్టు ఆదేశాల మేరకు నిర్మిస్తున్నారా అంటూ ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులను వివరణ కోరగా, సెన్సిటివ్ జోన్ పరిధిలోనే పనులు చేపట్టినట్లు ప్రాజెక్టు ఇంజినీర్లు కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట అడిషనల్ కమిషనర్ సుభద్ర దేవి, డీసీ సమ్మయ్య, ప్రాజెక్టు ఈఈ మాన్య నాయక్, ఎస్ఈ శ్రీలక్ష్మి, డిప్యూటీ ఈఈ హరీశ్, సర్కిల్ ఈఈ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ జోనల్ సిటీ ప్లానర్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఫేస్ 5 ప్లాట్ యజమానులు

రోడ్డును చూపి అక్రమ నిర్మాణాలు

మాదాపూర్, జూన్ 3: మియాపూర్ జనప్రియ నగర్ ఫేస్ 5 లో నివాసముంటున్న ప్లాట్ యాజమానులు గతంలో ఎమ్మెల్యే నిధుల కింద కాలనీ లో రోడ్డు నిర్మాణాన్ని చేసుకున్నారు. ఆ కాలనీ కి ఆనుకోని ఉన్న అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు జనప్రియ నగర్ ఫేస్ 5 యజమానులు ఏర్పాటు చేసుకున్న రోడ్డును లే అవుట్‌గా చూపించి అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. దీంతో మంగళవారం ఫేస్ 5 బాధితులు జీహెచ్ఎంసీ జోనల్ సిటీ ప్లానర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఫేస్ 5 లో మొత్తం 650 ప్లాట్ లు ఉండగా ప్లాట్ లను గ్రూప్ హౌసింగ్ పథకం కింద సర్వే నంబర్, 47,48,49 వైడ్ ఎల్ ఆర్ నంబర్ 15512/ ఎంపీ 2హెచ్ / 98 07 హుడా ప్రొసెసింగ్ నంబర్ జీ 129/బీపీ/3350/2000 గుంటల్లో విలేజ్ నందు నిర్మించారు. ఫేస్ 5 స్థలానికి పక్కన ఉన్న కొంతమంది ఇంటి నిర్మాణం చేపట్టి డ్రైనేజీ, నాలా ఆక్రమించి ఫేస్ 6 సరిహద్దు గోడను కూల్చివేసి కాలనీ రోడ్డును తమ కాలనీ రోడ్డుగా చూపి తమ స్థలంలోకి ప్రవేశించి అక్రమంగా నిర్మాణం చేశారు. అధికారులు వారికిచ్చిన బిల్డింగ్ పర్మిషన్, ఆక్యూపెన్సీ సర్టిఫికెట్ ను రద్దు చేయాలని కోరారు. అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకొని ఫేస్ 5 కాలనీని సందర్శించి న్యాయం చేయాలని ఫేస్ 5 కాలనీ ప్రజలు కోరారు.